డ్వామా పీడీగా రాము

ప్రజాశక్తి - ఏలూరు

డ్వామా పీడీ ఆరవపల్లి రాము శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ పీడీగా పనిచేసిన రాంబాబు కమిషనరేట్‌లో రిపోర్ట్ చేయనున్నారు. బాధ్యతలు చేపట్టిన రాము గతంలో నల్లజర్ల, చాగల్లు, తాళ్లపూడి, ఉంగుటూరు, కొవ్వూరు, నిడదవోలు ఎంపిడిఒగా పనిచేశారు. అనంతరం ఉద్యోగోన్నతిపై సెక్రటేరియట్‌లోని లీగల్ సెక్షన్‌లో కోర్ట్ కేసులు పరిష్కార విభాగంలో పనిచేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జిల్లా డ్వామా పీడీగా పోస్టింగ్ ఇచ్చింది. ఈ సందర్భంగా రాముకు పలువురు జిల్లా అధికారులు, డ్వామా సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆ వడ్డీ వెనక్కివ్వండి..!

సహకార సంఘాలపై డిసిసిబి ఒత్తిడి

2010-13 మధ్య రైతులకిచ్చిన వడ్డీ రాయితీ రూ.27.51 కోట్లు

అది తిరిగి కట్టాలని హుకుం

అవినీతి వ్యవహారాలతో డిసిసిబి క్యాష్ రేషియో 6.25కు పతనం

అది పూడ్చుకునేందుకు సహకార సంఘాలను చిదిమేసేందుకు సిద్ధం

రైతులకిచ్చిన సొమ్ము ఎలా కట్టాలని సహకార సంఘాల ఆందోళన

ఆడిట్ అభ్యంతరాలపై సమాధానమివ్వని డిసిసిబి

ఏలూరులోని డిసిసిబి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సహకార సంఘాల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చేందుకు డిసిసిబి (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) పూనుకుందా. అవినీతి వ్యవహారాలతో డిసిసిబికి వచ్చిన నష్టాలను సహకార సంఘాలపై మోపేందుకు ప్రణాళిక రచించిందా... ప్రభుత్వం నుంచి వడ్డీరాయితీ సొమ్ము రాలేదనే నెపంతో రూ.కోట్ల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా సంఘాల నుంచి వసూలు చేసేందుకు కుయక్తులు పన్నిందా.. అంటే అవుననే సమాధానం వస్తోంది. దాదాపు దశాబ్దకాలం క్రితం రైతులకిచ్చిన వడ్డీ రాయితీ సొమ్మును ఇప్పుడు సహకార సంఘాలు కట్టాలని ఉత్తర్వులు జారీ చేయడంపై సంఘాల కార్యదర్శులు, పాలక కమిటీలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

డిసిసిబి (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు)కు ఉమ్మడి జిల్లాలో 34 బ్రాంచీలు ఉన్నాయి. వీటి పరిధిలో 258 సహకార సంఘాలు ఉన్నాయి. సహకార సంఘాలనేవి రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు ఏర్పడినవి. సహకార సంఘాల్లో రెండు రకాల రుణాలిస్తారు. పంట రుణాలు వంటి షార్ట్‌టర్మ్ రుణాలు, గేదెలు, గొర్రెలు, వాహనాలకు సంబంధించిన లాంగ్‌టర్మ్ రుణాలను రైతులకు అందిస్తారు. లాంగ్‌టర్మ్ రుణాలకు 11.15 శాతం నుంచి 15 శాతం వరకూ వడ్డీ ఉంటుంది. 2014 ముందు వరకూ సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీరాయితీ కింద ఆరు శాతం ప్రభుత్వం ఇచ్చేది. అందులో భాగంగానే జిల్లాలోని సహకార సంఘాలకు 2010-11లో రూ.4,36,85,983 కోట్లు, 2011-12కు సంబంధించి రూ.10,34,83,734 కోట్లు, 2012-13లో రూ.12,80,11,692 కోట్లు మొత్తం రూ.27,51,81,409 కోట్లు జిల్లా రైతులకు వడ్డీ రాయితీ వర్తించింది. ఈ సొమ్మును డిసిసిబి తమ పరిధిలోని సహకార సంఘాల్లోని రైతులకు వడ్డీరాయితీ సొమ్ము చెల్లించడం సైతం జరిగింది. ఇది జరిగి దాదాపు 12 ఏళ్లు కావొస్తోంది. రైతులకు తామిచ్చిన వడ్డీ రాయితీ సొమ్మును ప్రభుత్వం నుంచి రాలేదు. అందువల్ల రూ.27.51 కోట్లు సొమ్మును సహకార సంఘాలు చెల్లించాలని గత నెల 29వ తేదీన డిసిసిబి సహకార సంఘాలకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సహకార సంఘాల కార్యదర్శులు, పాలకవర్గ కమిటీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. పదేళ్ల క్రితం రైతులకిచ్చిన వడ్డీ రాయితీ సొమ్ము ఏవిధంగా సహకార సంఘాలు చెల్లిస్తాయని, అప్పట్లో వడ్డీ రాయితీ తీసుకున్న రైతులు ఇప్పుడు చాలామంది సహకార సంఘాల్లో సభ్యులుగా కూడా లేరని చెబుతున్నారు. డిసిసిబి బ్యాంకు మరో కొత్త ఎత్తుగడ వేసి ఈ సొమ్మును రాబట్టేందుకు ప్రయత్నిస్తోంది. సహకార సంఘాలకు అప్పుగా ఇస్తామని, తిరిగి చెల్లించాలని చెబుతోంది. సహకార సంఘాలు డిసిసిబి నుంచి అప్పుగా సొమ్ము తీసుకుంటే ఆ సొమ్మును రైతులకు ఇవ్వాల్సి ఉంటుంది. మళ్లీ రైతుల నుంచి వసూలు కట్టాలి. ఇప్పుడు అప్పుగా ఇచ్చే సొమ్మును రైతులకు ఇవ్వకుండా డిసిసిబికి ఇస్తే ఆడిట్‌లో ఏవిధంగా చూపించాలని సహకార సంఘాల కార్యదర్శులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా చేస్తే సంఘం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని భయం అందరినీ వెంటాడుతోంది. పదేళ్ల తర్వాత వడ్డీరాయితీ సొమ్ము వెనక్కి తీసుకునేందుకు పూనుకోవడం వెనుక పెద్ద కుట్ర ఉన్నట్లు తెలుస్తోంది. వడ్డీ రాయితీ కింద సొమ్ము కట్టాల్సి వస్తే ప్రతి సహకార సంఘం రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉంది. మచ్చుకు పరిశీలిస్తే ఆకివీడు మండలంలో ఐదు సహకార సంఘాలున్నాయి. వీటిలో వడ్డీరాయితీ కింద ఆకివీడు సంఘానికి రూ.5.56 లక్షలు, ఉండి సంఘానికి రూ.3.56 లక్షలు, పెదపుల్లేరుకు రూ.20 వేలు, చెరుకుమిల్లి సంఘానికి రూ.79 వేలు, కలవపూడి సంఘానికి రూ.47 వేలు ఇలా మొత్తం మండలంలోని సహకార సంఘాలు రూ.10.61 లక్షలు వరకూ చెల్లించాల్సి ఉంది. పెద్ద సహకార సంఘాలు మరింత ఎక్కువగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

అవినీతి ఆరోపణల వెల్లువ.. క్యాష్ రేషియో 6.25 శాతానికి పతనం

జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలో 34 బ్రాంచీలు ఉండగా గోపాలపురం, చాగల్లు వంటి బ్రాంచీల్లో నకిలీ బంగారం తాకట్టు వ్యవహారంతో పెద్దఎత్తున అవినీతి జరిగింది. నిడదవోలు, పాలకొల్లు, యలమంచిలి, పెనుగొండ, తాడేపల్లిగూడెం బజార్ వంటి బ్రాంచీల్లో బ్యాంకు గ్యారెంటీలతో చేసిన అప్పుల మంజూరులో పెద్దఎత్తున అవినీతి సాగినట్లు బయటపడింది. మిగిలిన బ్రాంచీల్లో పరిస్థితి ఏమిటో ఇంకా తెలియాల్సి ఉంది. బయటపడిన లెక్కల ప్రకారం దాదాపు రూ.150 కోట్లు మేర డిసిసిబి బ్రాంచీల్లో అవినీతి జరిగినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. డిసిసిబిలో అవినీతి పరాకాష్టకు చేరడంతో బ్యాంక్ క్యాష్‌రేషియో పడిపోయినట్లు తెలుస్తోంది. జిల్లా సహకార కేంద్రబ్యాంక్‌కు వర్కింగ్ క్యాపిటల్, షేర్ క్యాపిటల్, రిజర్వుడు నిధులు, సెంట్రల్ బ్యాంకు నుంచి తీసుకున్న అప్పులు వంటివన్నీ కలిపి బ్యాంక్ క్యాష్ రేషియోగా లెక్కిస్తారు. ఈ క్యాష్ రేషియో తొమ్మిది శాతం ఉండాల్సి ఉండగా అవినీతి వ్యవహారాలతో 6.25 శాతానికి పడిపోయినట్లు తెలుస్తోంది. క్యాష్ రేషియో పడిపోవడంతో డిసిసిబికి నాబార్డు నుంచి వచ్చే నిధులకు అంతరాయం ఏర్పడనుంది. దీంతో డిసిసిబికి తీవ్ర ఇబ్బందులు వచ్చిపడతాయి. ప్రభుత్వం నుంచి ఒత్తిడి తెచ్చి వడ్డీరాయితీ నిధులు తీసుకోవాల్సి ఉండగా అది వదిలేసి సంఘాలను దెబ్బతీసే విధంగా డిసిసిబి ముందుకు సాగుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీనిపై వెంటనే ఉన్నతాధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, లేకపోతే సహకార సంఘాలకు తీవ్ర ఇబ్బందులు తప్పవని అంతా అభిప్రాయపడుతున్నారు.

చెప్పాల్సిన అవసరం లేదు

బి.శ్రీదేవి, సిఇఒ, డిసిసిబి

వడ్డీ రాయితీ సహకార సంఘాల నుంచి వసూలు చేయడంపై డిసిసిబి సిఇఒ శ్రీదేవిని ప్రజాశక్తి వివరణ కోరగా చెప్పాల్సిన అవసరం లేదని, మీకు ఎవరు చెప్పారో వాళ్లనే అడగాలంటూ సమాధానమిచ్చారు.

సహకార సంఘాల కార్యదర్శుల నుంచి వెల్లువెత్తుతున్న ప్రశ్నలు

-2013 మధ్యకాలంలో డిసిసిబి ఇచ్చిన వడ్డీరాయితీ సొమ్ము రైతులకు వెళ్లిపోయింది. సంఘం వద్ద లేదు. అంత సొమ్మును రుణంగా తీసుకుంటే ఎవరికి చెల్లించినట్లు చూపాలి. రైతులకు ఇవ్వకుండా మన దగ్గర ఉన్నట్లు చూపితే డిపార్టుమెంట్ ఆడిటర్లు ఒప్పుకుంటారా?

-2013లో లావాదేవీలకు సంబంధించి ఆడిట్ ప్రక్రియ పూర్తయింది. వాటిని ఎలా మార్చగలం. వాటికి ఆడిటర్లు ఒప్పుకుంటారా, అడిటర్లు ఒప్పుకోకపోతే డిపార్టుమెంట్ కార్యదర్శులపై చర్యలు తీసుకునే అవకాశం లేదా.. అప్పుడు ఏం చేయాలి. బ్యాంకు మనల్ని ఏ విధంగా కాపాడుతుంది?

-జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వడ్డీ రాయితీని వెనక్కి తీసుకోవాలనే విషయాలకు సంబంధించి డిపార్టుమెంట్ నుంచిగానీ, ఆప్కాబ్ లేదా నాబార్డు వారి నుంచి అనుమతులున్నాయా?

-ఆడిట్ జరిగిన అక్కౌంట్స్‌ను ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్టుమెంట్‌కు సమర్పించడం జరిగింది. ఇప్పుడు వారు ఒప్పుకుంటారా, ఒప్పుకోకపోతే డిపార్ట్‌మెంట్ నుంచి ఏవిధమైన చర్యలుంటాయి. అప్పుడు కార్యదర్శుల పరిస్థితి ఏమిటి?

-అడ్వాన్స్ షేర్ క్యాపిటల్ చెల్లించమంటున్నారు. మనం కట్టిన షేర్ క్యాపిటల్‌కే వారు వడ్డీ ఇవ్వట్లేదు. రిజిస్టర్ ఉత్తర్వులున్నా, సంఘ సభ్యుడు ఎవరైనా లోన్ క్లియర్ చేసినట్లయితే మనం వారికి షేర్ క్యాపిటల్ అడ్జెస్ట్ చేస్తున్నాం. అయితే సెంట్రల్ బ్యాంక్ మాత్రం మనం కట్టిన షేర్ క్యాపిటల్ తిరిగివ్వడం లేదు. ఇటువంటప్పుడు మన అడ్వాన్స్ షేర్ క్యాపిటల్ చేస్తే సంఘం వడ్డీ నష్టపోదా.. మనం అడ్వాన్స్ షేర్ క్యాపిటల్ చేస్తే దానికి తగ్గట్లు లోన్ ఇస్తారని నమ్మకం ఏమిటి? అంత లోన్ తీసుకోవడానికి మన దగ్గర సభ్యులుండాలి కదా? లోన్ మంజూరు ఆర్డర్ లేకుండా మీరు అంత షేర్ క్యాపిటల్ ఎందుకు కట్టారని డిపార్టుమెంట్ ఆడిటర్ అడిగితే ఏం సమాధానం చెప్పాలంటూ కార్యదర్శులు ప్రశ్నలు సంధిస్తున్నారు.

గందరగోళం..!

ఫిజిక్స్, ఎన్ఎస్ పరీక్షపై పదో తరగతి విద్యార్థుల ఆందోళన

ఒక పేపర్ రాశాకే.. రెండో పేపర్ రాస్తేనే మేలంటున్న ఉపాధ్యాయులు

ప్రతి 15 నిమిషాలకోసారి గుర్తు చేయాలనే ఆదేశం అమలయ్యేనా!

ప్రజాశక్తి - భీమవరం

పదో తరగతి విద్యార్థులను ఫిజిక్స్, ఎన్ఎస్ పరీక్షపై గందరగోళం, ఆందోళన నెలకొంది. ఈ పరీక్ష నిర్వహణపై అటు ఉపాధ్యాయుల్లోనూ, ఇటు విద్యార్థుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక పేపర్ రాశాకే రెండో పేపర్ రాస్తే ఉపయోగకరమని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో ఈ సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిలయ్యే ప్రమాదం ఉందని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రతి 15 నిమిషాలకోసారి విద్యార్థులకు దీనిపై గుర్తు చేయాలని ఇన్విజిలేటర్లకు విద్యాశాఖ నుంచి ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలొచ్చాయి. అయితే ఇది ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

గతేడాది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగాయి. ఈ ఏడాది నూతన విభజిత జిల్లాలో పరీక్షలు ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు 376 ఉన్నాయి. అధికారులు 121 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 24,586 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి 121 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 121 మంది డిపార్టుమెంటల్ అధికారులు, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 24 మంది రూట్ అధికారులను నియమించారు.

పదో తరగతి పరీక్షల్లో గతేడాది ఏడు పేపర్లు పెట్టగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో వాటిని ఆరింటికే కుదించి పరీక్షలు నిర్వహించేలా మార్పులు తీసుకొచ్చారు. ఈ ఏడాది ఫిజిక్స్, నేచురల్ సైన్స్ (ఎన్ఎస్)కు వేర్వేరుగా ప్రశ్నపత్రాలు, వేర్వేరుగా ఆన్సర్ బుక్‌లెట్లు ఇస్తారు. దీనిపైనే ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఈ పరీక్షకు సంబంధించి ఇప్పటికే నిర్వహించిన ప్రీ పబ్లిక్ పరీక్షల్లో ప్రాక్టీస్ చేయించినా చాలా స్కూళ్లల్లో విద్యార్థులు ఫిజిక్స్ ఆన్సర్ బుక్‌లెట్‌లో ఎన్ఎస్ ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు రాశారు. పబ్లిక్ పరీక్షల్లో ఇదే పునరావృతమైతే అంతిమంగా విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. రెండు ప్రశ్నాపత్రాలు, రెండు ఆన్సర్ బుక్‌లెట్లు ఒకేసారి ఇస్తారు. దీంతో విద్యార్థులు వారికి ఏ పేపర్ తేలిగ్గా ఉందో, దాన్ని ముందుగా రాసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే జవాబులు వేర్వేరు ఆన్సర్‌షీట్లపై రాయాల్సి ఉంది. దీంతో వాటిని రాసే క్రమంలో పొరపాటున ఒక దానిపై రాయాల్సింది మరోదానిపై రాస్తే విద్యార్థులకు నష్టం జరుగుతుందని, వేర్వేరుగా కాకుండా ఒకే ఆన్సర్ బుక్‌లెట్‌లో సమాధానాలు రాసేలా వెసులుబాటు కల్పించాలని ఇప్పటికే ఉపాధ్యాయులు పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే వారి నుంచి ఎటువంటి స్పందనా లేదు. పిల్లలకు ఈ నూతన విధానం అలవాటు కావాలని, ఎన్ఇసిఆర్‌టి పరీక్షలు రాసేవారు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ మూడు పేపర్లు విడివిడిగా రాస్తారని, కనీసం మన విద్యార్థులు రెండు పేపర్లయినా రాయకపోతే ఎలా అని చెప్పి పాఠశాల విద్యాశాఖాధికారులు వాదిస్తున్నారు.

సీరియల్ నంబరు వేర్వేరుగానే..

సీరియల్ నెంబరు ఒకటి నుంచి 16 వరకు ఫిజిక్స్, 17 నుంచి 33వ ప్రశ్న వరకూ ఎన్ఎస్ సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. పొరపాటున 17వ నంబరు ప్రశ్నకు ఫిజిక్స్ సమాధాన పత్రంలో రాస్తే ఆ మేరకు ఇన్వాలిడ్‌గా పరిగణిస్తారు. ఇది లేకుండా ఉండాలంటే 1 నుంచి 16 దాకా ఫిజిక్స్ ప్రశ్నావళికి ఆ ఆన్సర్ బుక్లెట్‌పైనే రాయాలి. ఎన్ఎస్‌కు కేటాయించిన 17 నుంచి 33 నెంబర్లు వరకూ సంబంధిత ఆన్సర్ షీట్‌పై సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు పరీక్ష రాసే సమయంలో తడబడి ఒకదాని బదులు మరో ఆన్సర్ షీట్‌లో సమాధానాలు రాస్తే ఆయా సబ్జెక్టుల్లో ఫెయిలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

విద్యాశాఖ ఆదేశాలు అమలయ్యేనా

ప్రతి 15 నిమిషాలకు ఒకసారి విద్యార్థులకు ఇన్విజిలేటర్లు గుర్తు చేస్తూ అప్రమత్తం చేసేలా విద్యాశాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ విషయాన్ని ప్రతి పరీక్ష గదిలో బోర్డుపై సైతం రాయాలని సూచించారు. తాము ఎంత ప్రాక్టీస్ చేయించినా ఇప్పటికీ చాలా మంది విద్యార్థులు పాఠశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లోనే అయోమయానికి గురై ఒకే బుక్‌లెట్‌పై ఫిజిక్స్, ఎన్ఎస్‌కు సమాధానాలు రాశారని పలువురు హెచ్ఎంలు తెలిపారు. పరీక్ష ఒకే రోజు పెడుతున్నప్పుడు ఆన్సర్ షీట్ సైతం రెండింటికి కలిపి ఒకటే ఇచ్చి రాయమంటే బాగుండేదని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో విద్యాశాఖ ఆదేశాలు ఎలా అమలవుతాయి, ఫలితాలు ఎలా రానున్నాయనే దానిపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

ఫిజిక్స్, ఎన్ఎస్ పరీక్ష నిర్వహణలో విద్యాశాఖ తీసుకొచ్చిన నూతన విధానంతో ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది రెండు పేపర్లుగా విభజించి, ఈ ఏడాదేమో ఒకే రోజు పరీక్షను నిర్వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండు బుక్‌లెట్‌ల చొప్పున 24 పేజీలు వేర్వేరుగా ఇచ్చినప్పటికీ ఒకదానికి సంబంధించిన ఆన్సర్ వేరొక బుక్‌లెట్‌లో రాసే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఒక పేపర్ రాసిన తర్వాత రెండో పేపర్ రాసుకోవాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో శనివారం పలుచోట్ల ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అరగంటపాటు విరామం లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది.

మండవల్లిలో వీధిలో చేరిన వర్షపు నీరు

పోలవరం: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల కేంద్రం పోలవరంలో డ్రెయిన్లు పొంగిపొర్లాయి. కల్లాల్లో ఉన్న మొక్కజొన్న తడిసి ముద్దయింది. గాలీవాన బీభత్సానికి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

నూజివీడు రూరల్ : మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు మామిడి పంటకు భారీ నష్టం వాటిల్లింది. హనుమంతులగూడెం, మిట్టగూడెం, అన్నవరం, వెంకటాద్రిపురం, దిగవల్లి గ్రామాల్లో బలమైన గాలులు వీచడంతో మామిడి నేలరాలింది. అలాగే మొక్కజొన్న ఇతర కూరగాయల పంటలకూ తీవ్రమైన నష్టం వాటిల్లినట్లు రైతులు అంటున్నారు. చేతికొచ్చిన పంటకు నష్టం వాటిల్లడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండవల్లి : మండలంలో శనివారం కుంభవర్షం కురిసింది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అరగంటపాటు విరామం లేకుండా కురిసిన వర్షానికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. మండవల్లిలోని బిసి, ఎస్‌సి కాలనీలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి రైల్వే గేటు వద్ద దళితవాడలోని రహదారులతోపాటు జాతీయ రహదారి పూర్తిగా నీట మునిగింది. విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అలాగే పెదపాడు, ఏలూరు పట్టణం, రూరల్, పెదవేగి, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, కామవరపుకోట, లింగపాలెం, చింతలపూడి, ముసునూరు, చాట్రాయి తదితర మండలాల్లో విస్తారంగా వర్షం కురిసింది.

3న స్పందన యథాతథం

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో ఈనెల మూడో తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహించబడుతుందన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకోవాలి

ఫ్యాక్టరీ ఉద్యోగ, కార్మికుల 700 రోజుల దీక్షకు కార్మిక సంఘాల సంఘీభావం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు, కార్మికులు

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గత 700 రోజులుగా విశాఖపట్నంలో జరుగుతున్న దీక్షలకు సంఘీభావంగా శనివారం ఏలూరులో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రయివేటుపరం కాకుండా కాపాడుకుంటామని పేర్కొన్నారు. మోడీ, అమిత్ షాలు దేశ సంపదను కార్పొరేట్ వ్యక్తులకు, ఆదానీ, అంబానీలకు అప్పగించడాన్ని వారు విమర్శించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను మోడీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాలు మానుకోకపోతే తగిన గుణపాఠం ఉద్యోగ కార్మిక సంఘాలు చెప్తాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఎఐటియుసి జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, ఎ.అప్పలరాజు ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కాకర్ల అప్పారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, కె.కన్నయ్య, పోలా భాస్కర్, బల్ల కనకదుర్గారావు, కె.రాంబాబు, ఎస్.బాలు, గనిశెట్టి ఈశ్వరరావు, జనపాల రవి, యశ్వంత్ కుమార్, పి.నూకరాజు, ఐఎఫ్‌టియు నాయకులు మంగం అప్పారావు, ప్రసాద్, ఇల్లా శ్రీను, మంగం పెద్దిరాజు, పాండు, రామ్మోహన్, కె.రాజు, ఆంజనేయులు, కుమార్, సిఐటియు నాయకులు వివిఎన్.ప్రసాద్, కోటేశ్వరరావు, జి.శ్రీను పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి తరలిన సిఐటియు నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల ఐదో తేదీన లక్షలాది మందితో జరుగుతున్న కార్మిక, కర్షక ఐక్యత ర్యాలీలో పాల్గొనేందుకు ఏలూరు జిల్లా నుండి సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. శనివారం తెల్లవారుజామున ఎపి ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తున్న వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. బృందానికి నాయకత్వం వహిస్తున్న జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లు దోచుకుంటున్నారని చెప్పారు. దేశ ప్రజలపై అధిక పన్నులు మోపడంతో మధ్యతరగతి, సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన చేశారు. నవరత్నాలుగా పేరొందిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తున్నారని చెప్పారు. లేబర్‌కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు రక్షణగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. కౌలు రైతులకు రక్షణ లేదన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని, రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించివేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌విఎస్.నారాయణ, ఎం.నాగమణి, ఎస్‌కె.సుభాషిని, కె.వెంకట్రావు, వై.సాయి కిరణ్, జె.గోపి, జాన్‌బాబు, సరోజిని, భాస్కర్‌రావు, నత్తా వెంకటేశ్వరరావు, ఉష పాల్గొన్నారు.

4న గ్రూప్-4 పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు : డిఆర్‌ఒ

ఏలూరు: జిల్లాలో ఈ నెల నాలుగో తేదీ జరిగే ఎపిపిఎస్‌సి గ్రూప్-4 సర్వీసెస్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం ఏలూరు కలెక్టరేట్ డిఆర్‌ఒ ఛాంబర్‌లో గ్రూప్ 4 పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో డిఆర్‌ఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మూర్తి మాట్లాడుతూ గ్రూప్-4 సర్వీసెస్‌కు సంబంధించిన పోస్టుల భర్తీకి నిర్వహించనున్న కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ పరీక్షకు 710 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని, ఉదయం షిఫ్ట్ 9.30 గంటల నుండి 12 గంటల వరకూ, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 నుండి ఐదు గంటల వరకూ జరుగుతాయని తెలిపారు. పరీక్షా సమయానికి గంట ముందుగానే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

దోసపాడు దళితుల గోడు పట్టదా

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

ఆందోళన చేస్తున్న దళితులు, నాయకులు

దెందులూరు మండలం దోసపాడు గ్రామానికి చెందిన పేదలు, దళితులు పది నెలల నుండి వారి భూముల కోసం మొక్కవోని దీక్షతో పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడం సిగ్గు చేటని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. ఈ భూ పోరాటంలో భాగంగా శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జెసి, ఆర్‌డిఒలకు తపాలాలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రారంభమైన దోసపాడు భూ పోరాటం పేదలకు, దళితులకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. ఈ పోరాటంలో పేదలు, దళితులు పలుమార్లు మండల రెవెన్యూ శాఖ అధికారులు, జిల్లా అధికారులను కలిసి వారి గోడు విన్నవించుకున్నప్పటికీ కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. పేదల హక్కులను కాలరాస్తూ, దళితుల చట్టాలను నీరుగారుస్తూ తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు కట్టి మూడు నెలలు దాటినప్పటికీ నేటికీ ఆ కేసులో ఉన్న నిందితులను అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు భూస్వాములు ఇచ్చే లంచాలు మింగి పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యలపై జిల్లా కోర్టును ఆశ్రయించగా కోర్టు పేదలకు అనుకూలంగా భూములు సాగు చేసుకోవచ్చని చెప్పినా రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కోర్టు ఆదేశాలు ధిక్కరించిన అధికారులపై ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పేదల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే, మంత్రులకు దోసపాడు దళితులు, పేదలు కనబడటం లేదా అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం స్పందించి దోసపాడు దళితులకు న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో 144, 145 సెక్షన్లు ఎత్తివేసి పేదలకు రక్షణ కల్పించాలన్నారు. ఎవరైతే భూములు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారో వారిపై అసైన్మెంట్ యాక్ట్ సెక్షన్ 4 ప్రకారం అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.ఆనందరావు, డి.గంగాధర్, సిహెచ్.భూషణం, కె.ప్రసాద్, సిహెచ్.జాన్‌రాజ్, ఏసు మణి, మాణిక్యం, హేమలత పాల్గొన్నారు.

వడ్డీ రాయితీ వసూలు నిర్ణయం సరికాదు

నూజివీడు: రైతుల నుండి సహకార సంఘాలు 2010 సంవత్సరం నుంచి వసూలు చేయాల్సిన ధీర్ఘకాలిక రుణాలపై ఆరు శాతం వడ్డీ రాయితీ వసూలు చేయాలన్న డిసిసిబిల నిర్ణయం సహకార సంఘాల మనుగడకు ప్రశ్నార్థకమని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. నూజివీడులో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వం నుండి సహకార సంఘాలకు రావాల్సిన ధీర్ఘకాలిక రుణాలు ఆరు శాతం వడ్డీ రాయితీ 2010-11 సంవత్సరం నుండి 2012-2013 వరకూ వరకు రూ.46.72 కోట్లు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని 651 సహకార సంఘాలకు రావాల్సి ఉందన్నారు. అప్పటి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతుల నుంచి వసూలు చేసిన ధీర్ఘకాలిక రుణాలపై ఆరు శాతం వడ్డీ రాయితీ మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని నగదుగా సహకార సంఘాలు వసూలు చేశారని నీలం తెలిపారు. ఈ విధంగా ఏలూరు డిసిసిబి పరిధిలోని 263 సహకార సంఘాలకు 27.52 కోట్లు, కాకినాడ డిసిసిబి పరిధిలోని 388 సహకార సంఘాలకు రూ.19.20 కోట్లు రైతుల నుండి వసూలు చేయాల్సి ఉందన్నారు. పుష్కరకాలం గడిచిన తరువాత ఈ రెండు జిల్లాల సహకార కేంద్ర బ్యాంకులు రిజర్వ్ బ్యాంక్ నిబంధనలు సిఆర్ఎఆర్ (క్యాపిటల్ రిస్క్ ఎడీక్వసి రేషియో) తొమ్మిది శాతం పెంచుకునే దిశలో సహకార సంఘాలను బలిపశువులను చేస్తోందన్నారు.

ఎంఎల్‌ఒను నియమించాలని ధర్నా

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో సహాయ కార్మిక శాఖాధికారిని నియమించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘాలు శనివారం ధర్నా నిర్వహించాయి. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు సిద్దెన నాగు అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు మాట్లాడుతూ కుక్కునూరు, వేలేరుపాడు, కొయ్యలగూడెం మండలాల పరిధిలో పోలవరంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం కార్మిక సంక్షేమ శాఖ కార్యకలాపాల నిర్వహణ కోసం శాశ్వత ప్రాతిపదికన సహాయ కార్మిక అధికారిని నియమించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు జరుగుతుంటే వ్యవస్థలు చేయాల్సిన అధికారులు లేకపోవడం బాధాకరమన్నారు. తహశీల్దార్ బత్తుల సుమతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిద్దెన రాంబాబు, తుమురాడ పోశిబాబు, లింగోజు భాస్కర్ రావు, తోట వెంకటేశ్వరరావు, నరాలశెట్టి నాగు, గవర వాసు, కంభంపాటి గోపి, గోరుమిల్లి రమేష్, పట్టిసీమ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నాని పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి ప్రతాప్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - ముసునూరు


జెడ్‌పిటిసి సభ్యులు ప్రతాప్

కర్ణాటక రాష్ట్రంలోని ఆసియా వేదిక కల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఆసియా ఇంటర్నేషనల్ అకాడమీ వారు జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. గత 15 ఏళ్లగా విద్య, సామాజిక, సేవా రంగాల్లో తాను చేస్తున్న కార్యక్రమాలను గుర్తించి ఆసియా వేదిక కల్చరల్ యూనివర్సిటీ సత్కరించిందని సందర్భంగా తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు వరికూటి ప్రతాప్ తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, మహిళా శిశుసంక్షేమ రీజనల్ ఛైర్పర్సన్ వందనపు సాయి బాలపద్మ, ఐసిడిఎస్ పిడి పద్మావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో వారు పాల్గొన్నారు. ఐసిడిఎస్ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామ తులసి, ఎంపిపి కారం శాంతి, వైస్ ఎంపిపి కుక్కల వరలక్ష్మి, మోహన్‌రావు, అల్లూరి రత్నాజి, ఎ.సత్యనారాయణ, కొవ్వాసు నారాయణ, సర్పంచి తెల్లం వెంకాయమ్మ పాల్గొన్నారు.

'ఎన్నికల హామీల అమలు ఘనత జగన్‌దే'

ప్రజాశక్తి - భీమడోలు

ఎన్నికల వాగ్దానాల్లో దాదాపుగా నూరు శాతం పూర్తి చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం ఆయన భీమడోలు గ్రామంలో పర్యటించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి పి.సునీతారాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల పరిధిలోని సూరప్పగూడెం, పోలసానిపల్లి, అంబర్‌పేట, భీమడోలు గ్రామాల పరిధిలోని 5394 మంది సభ్యులు ఉన్న 552 స్వయం సహాయక సంఘాలకు మూడో విడత ఆసరాగా మంజూరైన రూ.5.14 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందించారు. తొలత డ్వాక్రా మహిళలు సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎంఎల్‌ఎ గ్రామసచివాలయ పరిధిలోని బిసి కాలనీలో రూ.50 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేయనున్న మంచినీటి బోరు పనులకు శంకుస్థాపన చేశారు. పారిశుధ్య పనుల నిర్వహణకు గ్రామపంచాయతీ రూ.9.50 లక్షలతో రూపాయల కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను సర్పంచితో కలిసి ప్రారంభించారు. పోలసానిపల్లిలో ఈ నెల 12 ,13, 14 తేదీల్లో నిర్వహించే శ్రీ ఆదాయిన సభల గోడపత్రికలను సర్పంచి షేక్ రహీమా బేగం హసేన, పాస్టర్ ఏసయ్యలతో కలిసి ఆవిష్కరించారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి : ఎంఎల్‌ఎ బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ చేసిన అసెంబ్లీ తీర్మానం వల్ల ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న నియోజకవర్గాల్లో ఆదివాసీ గిరిజనులకు నష్టం కలగదని ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. గిరిజనుల కోసం పాడేరులో మెడికల్ కాలేజీ, కురుపాంలో ఇంజినీరింగ్ కాలేజీ, సాలూరులో గిరిజన యూనివర్సిటీ మంజూరు చేశారన్నారు. ఏడు ఎస్‌టి నియోజకవర్గాల్లో గిరిజనులకు మెరుగైన వైద్యం కోసం మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్ నిర్మిస్తున్నారన్నారు. ఈ ఏడు నియోజకవర్గాల్లో ఏజెన్సీ ప్రాంతంలో వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగాలు, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు, సర్పంచి పదవులు, ఎంపిటిసి సభ్యులు, జెడ్‌పిటిసి, ఎంపిపి పదవులు అన్ని స్థానిక ఆదివాసీ గిరిజన అభ్యర్థులకే అవకాశం కల్పించారన్నారు. ఆదివాసీ గిరిజనులకు అన్యాయం జరుగుతుంటే ఎటువంటి పోరాటానికైనా తాను సిద్ధమన్నారు. ఏజెన్సీ ఆదివాసీ గిరిజనుల అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన జగన్ : టిడిపి

పోలవరం : రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన సిఎం జగన్‌కు ఆర్థిక వనరులు, ఉద్యోగాలు సృష్టించడం చేతకాదని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు విమర్శించారు. పోలవరంలోని ఆయన నివాసం వద్ద శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క అవకాశం అంటూ గద్దెనెక్కిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. పాలనలోకి వచ్చిన ఈ నాలుగు ఏళ్లలో ఒక్క ఉద్యోగం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎంపిపి మాజీ వైస్ప్రెసిడెంట్ కుంచే దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఎస్‌ఎల్‌ఆర్, జల్లేపల్లి వెంకట నరసింహారావు, పోలవరం పంచాయతీ మాజీ వైస్ ప్రెసిడెంట్ మంగిన కొండ, ఎస్‌సి సెల్ నాయకులు పిల్లి నాగరాజు, టిఎన్ ప్రెసిడెంట్ పోతాబు శ్రీనివాసరావు, ఏలూరు పార్లమెంటరీ బిసిడిపి అధికార ప్రతినిధి జల్లేపల్లి శేష వెంకట జితేంద్ర పాల్గొన్నారు.

పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు ఉచితంగా వేయనున్నట్లు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.సాయి బుచ్చిరాజు తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూలై 31 వరకు అన్ని పశువైద్యశాలల్లో, రైతు భరోసా కేంద్రాల్లో ఇంజెక్షన్లు వేయనున్నట్లు ఆయన తెలిపారు. మేలు రకానికి చెందిన పాడి పశువు నుంచి తీసిన వీర్యాన్ని కృత్రిమ గర్భధారణ ద్వారా పాడి పశువులకు వేయనున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ఆన్‌లైన్ మోసంపై కేసు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆన్‌లైన్ మోసంపై జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన ఓ మహిళ డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తుంది. ఆమె విలువైన బహుమతి గెలుచుకున్నారని ఈ ఏడాది జనవరి నెలలో ఫర్నాన్ పే సీక్రెట్ యాప్ అనే ఫేక్ కంపెనీ నుంచి ఏజెంట్లు మహిళను మాటలతో నమ్మించారు. అయితే ముందుగా రూ.50 వేలు చెల్లించాలన్నారు. జనవరి నెలాఖరులోనే ఫోన్ పే ద్వారా రూ.50 వేలు, అనంతరం దశదశలుగా మొత్తం రూ.3,09,640 ఫోన్ పే ద్వారా చెల్లించుకున్నారు. ఆ తరువాత తనకు రావాల్సిన సొమ్ము ఇవ్వమని అడిగినా ఏదో ఒక సమాధానం చెబుతూ కాలయాపన చేస్తూ వచ్చారు. ఇటీవల ఆమె తన డబ్బులు తిరిగి చెల్లించాలని అడిగినా కంపెనీ నష్టాల్లో ఉండటంతో మూసేశారని, సొమ్ము ఇవ్వడం కుదరదని చెప్పడంతో బాధితురాలు జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై స్టేషన్ హెచ్‌సి శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

లక్కవరం పామాయిల్ తోటలో నాటుసారా తయారీ స్థావరంపై ఎస్‌ఇబి దుర్గాపాతేశ్వరరావు తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. నాటుసారా తయారు చేస్తున్న మధును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం, నాటు సారా తయారీకి ఉపయోగించే గ్యాస్ సిలిండర్, అల్యూమినియం పాత్రలు, రెండు ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఇ తెలిపారు. మధుపై లక్కవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఇ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పది పరీక్షలకు సర్వం సిద్ధం

విద్యార్థులు సిద్ధం

చాట్రాయి విద్యశాఖాధికారి వెంకటేశ్వర్లు

చాట్రాయి :పదో తరగతి పరీక్షలు రాసేందుకు విద్యార్థులను సిద్ధం చేశామని చాట్రాయి ఎంఇఒ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు 455 మంది చాట్రాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్‌సియం పాఠశాలలో పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాస్తారన్నారు. విద్యార్థులను ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని, 9.30 గంటల నుంచి 12:30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష పత్రాలు, ప్రశ్నాపత్రాలు 15 నిమిషాల ముందు విద్యార్థులకు అందిస్తారన్నారు. ఇన్విజిలేటర్లకు సెల్‌ఫోన్లు నిషేధించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో పరీక్షా సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులు పరీక్షలు రాయటానికి 24 పేజీల బుక్లెట్ ఒకేసారి ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి పేజీలో 18 లైన్లు పూర్తిగా రాయాలన్నారు. విద్యార్థుల పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స నిర్వహించడానికి ఎఎన్‌ఎం మెడిసిన్ పెట్టి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పరీక్షలకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు ఆరు, ప్రయివేట్ పాఠశాలలు మూడు, పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు చిన్నంపేట, చనుబండ, సి.గుడిపాడు, పోలవరం, చిత్తపూరు, చాట్రాయి ప్రయివేట్ పాఠశాలలు, వికాస్ పబ్లిక్ స్కూల్ చాట్రాయి, ఉషోదయ పబ్లిక్ స్కూల్ చనుబండ, సిద్ధార్థ హైస్కూల్ చిన్నంపేట గ్రామాల్లోని పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో పరీక్షలు రాసి చాట్రాయి మండలానికి మంచి పేరు తీసుకువస్తారని ఆశ భావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

పోలవరం విద్యశాఖాధికారి బిబిఎస్.స్వరూప్

పోలవరం :ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పోలవరం విద్య శాఖాధికారి బిబిఎస్.స్వరూప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ కలెక్టర్, విద్యాశాఖ ఆదేశాల మేరకు పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా కేటాయించినట్లు చెప్పారు. పోలవరం పరీక్ష కేంద్రంలో పోలవరం, ఆర్‌సిఎం, బోడిగూడెం, ఇటుకలకోట, చేగొండపల్లి, సాయి స్కూల్ నుంచి 313 మంది విద్యార్థులు, గూటాల పరీక్ష కేంద్రంలో మహదేవ పాఠశాల, కొత్త పట్టిసీమ పాఠశాలల నుంచి 98 మంది విద్యార్థులు మొత్తం మండల పరిధిలో 411 మంది పదో తరగతి విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించారన్నారు. అన్ని సబ్జెక్టులు అర్థమయ్యే విధంగా బోధించారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించారన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడం లక్ష్యంగా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టితో పాటు పదికి పది జిపిఎ సాధన లక్ష్యంగా బోధించారన్నారు. వెనుకబడిన విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరు కాని విద్యార్థులను గుర్తించి సదరు విద్యార్థుల ఇంటికెళ్లి వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ నిర్వహించారని తెలిపారు.

చింతలపూడిలో ఆరు సెంటర్లు కేటాయింపు

చింతలపూడి ఎంఇఒ రామారావు

చింతలపూడి : ఈ నెల 3న ప్రారంభమయే పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చింతలపూడి ఎంఇఒ రామారావు తెలిపారు. పది పరీక్షలకు మండలంలో ఆరు సెంటర్లను పరీక్ష కేంద్రాలుగా కేటాయించినట్లు తెలిపారు. యర్రగుంటపల్లి, సుబ్బరాజు జిల్లా పరిషత్ హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ప్రగడవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భాష్యం, శ్రీచైతన్య సెంటర్లను కేటాయించారరన్నారు. మొత్తం 1450 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు హాల్‌టికెట్‌తో తొమ్మిది గంటలకు చేరుకోవాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాం

జీలుగుమిల్లి ఎంఇఒ కె.శ్రీనివాస్

జీలుగుమిల్లి : పదో తరగతి పరీక్షలకు మండల వ్యాప్తంగా విద్యార్థులను సన్నద్ధం చేసినట్లు విద్యాశాఖ అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలో పది పాఠశాలలు ఉండగా మొత్తం 412 మంది రెగ్యులర్ విద్యార్థులు, 98 మంది ప్రయివేట్ విద్యార్థులు పరక్షలకు హాజరవ్వుతున్నట్లు తెలిపారు. బర్రింకలపాడు గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. జంబ్లింగ్ విధానంలో పరీక్ష కేంద్రాలను కేటాయించినట్లు చెప్పారు. విద్యార్థులు 9.30 లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థుల సౌకర్యార్థం వారికి కావాల్సిన కనీస అవసరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా విద్యాబోధన

మండవల్లి :ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని లక్ష్యాన్ని ఎంచుకొని ఆ మేరకు విద్యార్థులకు విద్యాబోధన చేశామని చింతపండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కృష్ణమోహన్ తెలిపారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఏప్రిల్ మూడో తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు పాఠశాల నుంచి 42 మంది ఇంగ్లీష్ మీడియం 25 మంది తెలుగు మీడియంకు చెందిన 72 మంది సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. పాఠశాలల సంయుక్త సంచాలకుల ఆదేశాల మేరకు బోధించడం-పరిశీలించడం కార్యక్రమం ద్వారా ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి విద్యాబోధన చేశామన్నారు. అంతేకాకుండా సెలవు దినాల్లో కూడా విద్యా బోధన చేసి పరీక్షలకు సిద్ధం చేశామన్నారు. సి, డి గ్రేడ్‌లో ఉన్న పిల్లలను ప్రత్యేకించి ఉపాధ్యాయులు దత్తత తీసుకుని ప్రత్యేకంగా బోధన చేశారన్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా పాఠ్యాంశాలపై విద్యాబోధన చేసి సిలబస్‌ను పూర్తి చేశామన్నారు. విద్యార్థులు అధిక మార్కులు సాధించే విధంగా కృష్ణా జిల్లా విద్యాశాఖ అందించిన స్ఫూర్తి మెటీరియల్‌ను కూడా విద్యార్థులకు అందించి ప్రత్యేకంగా బోధించామన్నారు. సాయంత్రం వేళల్లో నిర్వహించిన ప్రత్యేక బోధనలో విద్యార్థులు నిరసించి పోకుండా ఉండే విధంగా కృష్ణా జిల్లా విద్యాశాఖ వారు అందించిన అల్పాహారాన్ని సక్రమంగా అందించి మరీ విద్యాబోధన చేశామని తెలిపారు. ప్రతి విద్యార్థి పబ్లిక్ పరీక్షలు ఎలా ఉంటాయోనని భయాందోళన చెందకుండా ధైర్యంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులను పూర్తిస్థాయిలో సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టును ఉపాధ్యాయులు క్షుణ్ణంగా విశ్లేషించి వివరించారన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తామని వారు స్పష్టం చేశారు.

పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

కలిదిండి : ఈ నెల మూడో తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ కొల్లాటి నరేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలో మొత్తం 729 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఐదు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1, 2 సెంటర్లతో పాటు ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భాస్కరరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలుగా కేటాయించినట్లు చెప్పారు. గతేడాది 65 శాతం మాత్రమే ఉత్తీర్ణత రావడంతో ఈ ఏడాది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. మండలంలోని ప్రతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో సబ్జెక్ట్ వారీగా విద్యార్థులు పట్టు సాధించే రీతిలో తర్ఫీదు పొందారన్నారు. చదువులో వెనుక బడిన విద్యార్థులను గుర్తించి ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దారన్నారు. వంద శాతం ఉత్తర్ణతతో పాటు అత్యధిక మార్కులే లక్ష్యంగా ఆయా పాఠశాలల ప్రానోపాధ్యాయులు కృషి చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పరీక్షా కేంద్రాల వద్ద తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ తెలిపారు.

607 మంది పరీక్షలకు హాజరు

ముసునూరు :ఈ నెల మూడో తేదీ నుంచి జరగనున్న పదోతరగతి పరీక్షలకు మండల వ్యాప్తంగా పరిక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఇఒ రత్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. మండల కేంద్రమైన ముసునూరు నుంచి 187 మంది, చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 285, గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 135 మంది మొత్తం 607 మంది పరీక్షలకు హాజరువుతున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రానికి పరీక్ష సమయానికి ముందుగానే చేరుకోవాలన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రానికి అనుమతించరని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

పది పరీక్షలపై ఎస్‌పి సూచనలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఈ నెల మూడో తేదీ నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షల సందర్భంగా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్కరికీ ఫోన్లు అనుమతించకూడదని, పరీక్షా కేంద్రాలకు దగ్గరలో ఉన్న జిరాక్స్ షాపులను మూసివేయించాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు ఉదయం 7.30 గంలకు చేరుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పోలీసు పెట్రోలింగ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆగిరిపల్లి ఎస్‌ఐ ఎన్.చంటిబాబు, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులను మోసగించిన జగన్'

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసినట్లే నిరుద్యోగులను కూడా సిఎం జగన్మోహన్‌రెడ్డి మోసం చేస్తున్నారని టిడిపి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ఫేక్ పెట్టుబడులతో మోసం చేసిన ప్రభుత్వం ఇప్పుడు బడ్జెట్లో అదే విధానాన్ని అవలంబించి అంకెల గారడితో ప్రజలను తప్పుదోవ పట్టించిందన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను నిలువున మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లేపల్లి రాజు, ఎత్తిపోయిన శివప్రసాద్, నిరంజన్, మారం హనుమంతరావు, జాలా బాలాజీ, మల్లెపు రాము పాల్గొన్నారు.

నూజివీడు :నిరుద్యోగ సూచిలో ఆంధ్రప్రదేశ్ జాతీయస్థాయిలో అగ్రభాగంలో ఉందని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని, అధికారంలోకి రాగానే రెండు లక్షల పైచిలుకు ఉద్యోగాలు కల్పిస్తానని ప్రకటించిన జగన్ రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో గత మూడున్నర సంవత్సరాలలో 21 వేల మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి ప్రకటించడం రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. అమరావతి నిర్మాణంలో 15 లక్షల ఉద్యోగాలకు శ్రీకారం చుడితే జగన్ రెడ్డి మూడు రాజధానుల దెబ్బకు అమరావతిని నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రం మత్తు పదార్థాల కేంద్రంగా మారిందన్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదికల ప్రకారం 2021లో మత్తు పదార్థాలకు బానిసై 571 మంది యువత ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. జగన్ అసమర్థ చేతకాని పాలనే వీటికి కారణమన్నారు.

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - మండవల్లి

స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ

ఏలూరును గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ అన్నారు. రహదారి విస్తరణలో భాగంగా పోలీస్ స్టేషన్ తొలగించబడుతున్న నేపథ్యంలో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించనున్న స్థలాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని అరికట్టడానికి చర్యలు చేపట్టామన్నారు. కైకలూరు, తదితర ప్రాంతాల్లో గంజాయిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సిబ్బందిని ఏర్పాటు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు 2021తో పోలిస్తే 2022లో తగ్గుముఖం పట్టాయన్నారు. పూర్తి స్థాయిలో స్పందన నిర్వహిస్తున్నామని, మండల స్థాయిలో పరిష్కారం కానీ కేసులను జిల్లా స్థాయిలో విచారించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. అనంతరం స్థల విషయంపై విఆర్‌ఒ కమల్‌హాసన్‌ను, ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కైకలూరు టౌన్, రూరల్ సిఐలు నాగరాజు, వైవిఎల్.నాయుడు, ఎస్‌ఐలు షణ్ముఖ సాయి, రామకృష్ణ, ఎఎస్‌ఐ కాకులు రాజు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మహిళల ఆర్థిక పరిపుష్టికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం నిర్వహించిన ఆసరా మూడో విడత కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని 1237 స్వయం సహాయక సంఘాలకు చెందిన 12,734 మంది డ్వాక్రా మహిళకు రూ.12.56 కోట్లు వారి ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.అనూష, జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, వైస్ ఎంపిపి జి.సాంబశివరావు, కె,రమేష్, ఎంపిడిఒ కె.వాణి, వెలుగు ఎపిఎం బి.రామకృష్ణ, ఎంఎస్ అధ్యక్షురాలు పి.దుర్గాభవాని పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం :వైఎస్‌ఆర్ ఆసరా మూడో విడత పంపిణీ సంబరాలు స్థానిక ఆలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ ఎలిజా మాట్లాడుతూ సిఎం జగన్ మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, ఎంపిపి కొదమ జ్యోతి పాల్గొన్నారు.

ఊపిరాడక సొమసిల్లి పడిపోయిన మహిళ

మహిళను పోలీస్ వాహనం ఎక్కించేందుకు తీసుకెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ శేఖర్

స్థానిక ఆలపాటి గంగాభవాని ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించిన ఆసరా మూడో విడత పంపిణీ సంబరాల కార్యక్రమంలో ఓ మహిళ ఊపిరాడక కుప్పకూలింది. ఆమెను పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఎంఎల్‌ఎ ఎలిజా మహిళను పరామర్శించారు. ఆసరా పంపిణీ కార్యక్రమానికి పట్టణంలోని డ్వాక్రా మహిళలు వేల సంఖ్యలో హాజరయ్యారు. దీంతో అనేకమంది సభా ప్రాంగణం బయటకు వచ్చి ఎండలో నిలబడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో చేబ్రోలు వరలక్ష్మి ఊపిరి ఆడక కుప్పకూలిపోయింది. వెంటనే హెడ్ కానిస్టేబుల్ జెట్టి శేఖర్ వరలక్ష్మిని చేతులపై మోస్తూ పోలీస్ వాహనంలో ఎక్కించి స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల పర్యవేక్షణలో వైద్యం అందించారు. చికిత్స పొందుతున్న వరలక్ష్మిని ఎంఎల్‌ఎ ఎలిజా పరామర్శించారు. వరలక్ష్మికి షుగర్ లెవెల్ తగ్గిపోవడంతో సొమసిల్లి పడిపోయారని వైద్యులు తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్ దేవి కమల తెలిపారు.

ఆసరా సంబరాలకు డ్వాక్రా మహిళలు కచ్చితంగా హాజరు కావాలని సంబంధిత అధికార సిబ్బంది హుకుం జారీ చేయడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సభా ప్రాంగణానికి చేరుకున్న తర్వాత తమకు తాగేందుకు సరిపడా నీరు కూడా అందుబాటులో లేదని వాపోయారు. ప్రాంగణంలో ఊపిరి అందక బయట ఎండలో నిలవలేక తిరుగుపయనం అయ్యేందుకు సిద్ధమైన మహిళలను గేట్లు మూసివేసి నిర్బంధించడం సరికాదని పలువురు డ్వాక్రా మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవి దృష్ట్యా సభా సమావేశాలు నిర్వహించే ప్రాంతంలో చలువ పందిళ్లు, తాగునీరు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - టి.నరసాపురం

గర్భిణులు, బాలింతలతో పాటు అనారోగ్య బాధితులు చిరు ధాన్యాలు తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు దూరమవుతాయని, సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని చింతలపూడి సిడిపిఒ పి.మాధవి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, ఉష, మణి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

నూజివీడు రూరల్ :మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ప్రకాశం రోడ్డుగా పిలవబడే గ్రామ ప్రధాన సిసి రోడ్డు అసంపూర్ణంగా మిగిలిపో యింది. గ్రామస్తుల సహకారంతో నిర్మాణం పూర్తి కావడంతో సీసీ రోడ్డును గ్రామ సర్పంచి బొకినాల వెంకటేశ్వరమ్మ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ గతంలో ఎంపీ సుజనాచౌదరి నిధులు రూ.20 లక్షలు, గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి దైవదాసు రూ.12 లక్షలు, సామాజిక సేవకుడు పొట్టూరి వెంకటేశ్వర కుటుంబ సభ్యులు అందించిన రూ.9 లక్షలతో సుమారు 87 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. నిధులు సరిపోకపోవడంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. దీంతో పలువురు గ్రామ ప్రముఖుల చొరవతో, ప్రవాస ఆంధ్రుల సహకారంతో సిసి రోడ్డు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. అందుకు సహకరించిన దాతలకు, గ్రామ పెద్దలకు, గ్రామస్తులకు సర్పంచి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఎస్‌టిపివి.వెంకటేశ్వర్లు, తటుకులూరి రంగారావు, మాజీ సర్పంచి, ఎంపిటిసి సభ్యులు చల్లారి రేణుక ధనలక్ష్మి, ఉపసర్పంచి రెడ్డి మధు, వార్డు సభ్యులు పాలొఓన్నారు.

విద్యార్థులకు పెన్నులు అందజేత

పోలవరం :విద్యార్థుల అభివృద్ధికి మానవత సంస్థ కృషి చేస్తుందని అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. గూటాల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో శనివారం అల్పాహారం, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాఘవన్ మాట్లా డుతూ మానవత సంస్థ సేవలు అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ చంద్రయ్య, సెక్రటరీ సుబ్బారావు, ఉపాధ్యాయులు హనుమంతరావు, శర్మ, సతిబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, శృంగవృక్షం గ్రామ సచివాలయం గ్రామానికి చెందిన జడ్డు వెంకటరంజిత్ కుమార్, తండ్రి: నాగ సాయి వెంకట సత్యనారాయణకు చెందిన విశాఖపట్నం వారు జారీ చేసిన పాస్‌పోర్టు నెం. **L5021131** ఒరిజినల్ పాస్‌పోర్టు ది. 28-03-2023వ తేదీన శృంగవృక్షం నుండి భీమవరం పాస్‌పోర్టు జిరాక్సు తీయించుటకు మోటారు సైకిల్ మీద వెళ్ళుచుండగా మార్గ మధ్యంలో పడిపోయినది. కావున నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు సంప్రదించవలెను.

జడ్డు వెంకట రంజిత్ కుమార్
తండ్రి: నాగసాయి వెంకటసత్యనారాయణ,
శృంగవృక్షం, డో.నెం. 7-117,
రాయిచెర్వు గట్టు, పాలకోడరు మండలం.
సెల్: 79950 13339

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 666/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Pattisapu Sitalakshmi an other ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) పట్టిసపు సీతాలక్ష్మి, భర్త: నాగరాజు, హిందువు, స్త్రీ, వ్యవసాయం, కంతేరు, H/o. అడవిపాలెం, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2) పజ్జూరి రమేష్, తండ్రి: మల్లేశ్వరరావు, హిందువు, పురుషుడు, పాలకొల్లు, పాలకొల్లు JCJC.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరుగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది.04-04-2023 వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా **ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

డి.ఎస్.వి.క్రిష్ణాజి
అడ్వకేట్, తణుకు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు తాడేపల్లిగూడెం
E.P.No. 23/2015
in O.S.N. 20/2014

బిట్వీన్:
అడబాల నాగేశ్వరరావు ...డి. హెచ్. ఆర్
అండ్
గరగ వెంకట సుబ్బలక్ష్మి ...జె.డి. ఆర్

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్తి వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ గాను ప్రతివాది జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి **ది.17-04-2023వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల** లగాయితు పై **కోర్టులో వేలం వేయబడును.** షరతులు తెలుసుకొని పాడవచ్చును.

షెడ్యూలు ఆస్తి

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, అప్పారావుపేట గ్రామ పరిధి, మోదుగుంట గ్రామం, తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రారులో ప్రతివాది తాలూకా ఆర్.ఎస్.నెం. 597/8, య.0-92 సెంట్లు డ్రై ల్యాండ్ యొక్క హద్దులు:
తూర్పు: గరగ చిన వెంకట్రావు గారి భూమి.
దక్షిణం: పుంత.
పడమర: కామన వెంకట్రావు గారి భూమి.
ఉత్తరం: కామన వెంకట్రావు గారి భూమి.

పై హద్దుల మధ్య య.0-92 సెంట్ల డ్రై ల్యాండ్ సమస్త పండ్ల చెట్లతో సహా.

డిక్రీ హోల్డర్ కిమ్మత్తు ధర : రూ. 1,00,000/-
అమీనా కిమ్మత్తు ధర : రూ. 10,00,000/-

ఎం.సి.హెచ్.కృష్ణమాచార్యులు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 70360 76151